క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

శ్రీరంగరాజపురం: మండలంలోని శ్రీరంగరాజపురం సచివాలయ పరిధిలోని నాయుడుపల్లి, సీకే పురం, పాతపాళెంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధి, అమలవుతున్న తీరు, గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకుంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

వృద్ధులకు దుస్తుల వితరణ



వృద్ధులకు చీరలు, పంచెలు అందజేస్తున్న వెంకటరామయ్య

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని 32 మంది వృద్ధులకు ఆదివారం పుత్తూరు పట్టణానికి చెందిన వెంకటరామయ్య తన భార్య వర్ధంతి సందర్భంగా చీరలు, పంచెలు పంపిణీ చేశారు. అలాగే బీరువా వితరణ చేశారు. అనంతరం దాత వెంకటరామయ్య మాట్లాడుతూ వృద్ధులకు చేయూతనివ్వడం ఆనందంగా ఉంటుందన్నారు. ఏటా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం తనకు ఇష్టమన్నారు. అలాగే మధ్యాహ్నం అన్నదానంతో పాటు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బాబు, జయచంద్ర, మురళి, భీమారావు, గుర్రప్ప, సాంబయ్య, సోమశేఖర్, వెంకటేష్, ప్రకాష్ పలువురు పాల్గొన్నారు.

ఘనంగా మాతమ్మ తిరునాళ్ల

విజయపురం (నగరి): మండలంలోని కేశవపురం ఆదిఆంధ్రవాడలో ఆదివారం మాతమ్మ తిరునాళ్ల ఘనంగా జరిగింది. పురవీధుల్లో వేపాకు తోరణాలు కట్టి, అక్కడక్కడ అమ్మవారి ప్రతిమ కలిగిన విద్యుత్ కటౌట్ ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలను అలంకరించారు. భక్తులు అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం సుమారు 150 మంది అగ్నిగుండ ప్రవేశం చేశారు. సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ఎస్వీయూ అధ్యాపకురాలికి అవార్డు



మాధవి

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీయూ రసాయన శాస్త్ర విభాగం ఆచార్యులు జి.మాధవి లండన్‌లోని రాయల్ సొసైటీ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలో అవార్డుకు ఎంపికయ్యారు. ఆమెకు అవార్డు రావడంపై వర్సిటీ వీసీ రాజారెడ్డి, రిజిస్ట్రార్ హుస్సేన్, రసాయన శాస్త్ర విభాగాధిపతి సురేష్ రెడ్డి, ఆచార్యులు వైవీ రామిరెడ్డి, వెంకట సుబ్బానాయుడు, మధుసూదన్ రెడ్డి, పద్మావతి, పద్మజ, ఎస్వీవీ జ్యోతి, ఎస్వై శ్రీధర్, వెంకట్రావు అభినందించారు.

రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన

తిరుపతి కల్చరల్: ఢిల్లీలో రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్, ఆల్ ఇండియా మహిళా సాంస్కృతిక సంఘం, అఖిల భారత రైతు–వ్యవసాయ కూలీ సంఘం నేతలు సంయుక్తంగా ఆదివారం బాలాజీ కాలనీలోని బస్టాప్ వద్ద నిరసన తెలిపారు. ఇండియా మహిళా సాంస్కృతిక సంఘం తిరుపతి ఇన్‌చార్జ్ లక్ష్మీసింగ్, అఖిల భారత ఉ పాధ్యక్షురాలు జి.లలిత మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

10న విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

తిరుపతి కల్చరల్: కేటీ రోడ్డులోని టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జూన్ 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు సంఘం సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు టీటీడీ పెన్షన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యుల నియామకాలు, సంఘం బైలాను ఆమోదించనున్నట్లు తెలిపారు. అలాగే మృతిచెందిన సంఘ సభ్యుల వారసులకు సోషల్ సెక్యూరిటీ పథకం కింద రూ.50 వేలు చెల్లిస్తామని పేర్కొన్నారు. 75 ఏళ్లు నిండిన టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు ఆనవాయితీగా 10 గ్రాముల వెండి డాలర్, జ్ఞాపిక అందజేసి సత్కరిస్తామని వెల్లడించారు.

అంకమ్మ దేవతకు పూజలు



పూజలందుకుంటున్న అంకమ్మ దేవత

బుచ్చినాయుడుకండ్రిగ: వేణుగోపాలపురం గ్రామదేవత అంకమ్మ దేవతకు ఆదివారం గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు పొంగళ్లు పెట్టి, అంబలి పోసి మొక్కులు తీర్చుకున్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వడదెబ్బపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు ముప్పు
- ఎండలో పని చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచన
- మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి





నగరి ఏరియా ఆస్పత్రి

ఎండలు తీవ్రత అధికమైంది. ప్రస్తుతం జిల్లాలో 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్, (శరీరంలో నీటి శాతం తగ్గడం) డయేరియా (విరేచనాలు) తదితర సమస్యలతో ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి చెబుతున్నారు.

నగరి: ప్రస్తుతం భానుడు భగభగమంటున్నాడు. ప్రజలు వేసవిలో వీలైనంత వరకు ఎండలో పని చేయకుండా ఉండడం మంచిది. ఉదయం, సాయంత్రం మాత్రమే ప్రజలు పనులు చేసుకోవడం మేలు. ఎండలో ఎక్కువ సేపు పనిచేస్తే చర్మం పొడి బారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, నొప్పులు వస్తాయి. ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వెళ్లే అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో వడదెబ్బకు గురైన బాధితులను చల్లని ప్రాంతంలో ఉంచి చల్లని గాలి తగిలేలా చూడాలి. శరీరాన్ని తడివస్త్రంతో బాగా తుడవాలి. ఉష్ణోగ్రత ప్రభావం తగ్గని పక్షంలో దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి.

వేసవిలో చేయకూడని పనులు

- ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో ఎక్కువగా తిరగరాదు.
- రోడ్లుపై అమ్మే కలుషిత ఆహారం తినరాదు
- వేసవిలో మాంసాహారం తగ్గించాలి.
- నూనెలో వేయించిన ఆయిల్ ఫుడ్ ఎక్కువగా తినకూడదు.
- మద్యం సేవించరాదు.
- రోడ్లు మీద చల్లని రంగు పానీయాలు తాగరాదు.

తీసుకోవాల్సిన పనులు..

- నీరు, పళ్ల రసాలు, కొబ్బరినీటితో పాటు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి
- రోజుకు కనీసం 15 గ్లాసులు నీటిని తాగాలి
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి
- పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి
- రోజుకు రెండు పూటలా స్నానం చేయాలి
- భోజనం మితంగా చేయాలి.
- తాజా కాయగూరలు, ఎక్కువగా తీసుకోవాలి
- ఆరుబయట పడుకున్నప్పుడు దోమతెరలు వాడాలి
- బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలి
- చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి

వడదెబ్బకు ప్రథమ చికిత్స

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి చేర్చాలి.
- ఐస్ నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం బాగా తుడవాలి.
- శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ ఇలానే చేస్తూ ఉండాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగను తాగించాలి. లేని పక్షంలో గ్లూకోజు ద్రావణం తాగించాలి.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు.
- వారిని వీలైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి



రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

గంగాధరనెల్లూరు (కార్వేటినగరం): మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని జైన్ ఫ్యాక్టరీ ముందు మామిడి రైతులు మామిడికాయలతో గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇటీవల జిల్లా కలెక్టర్ మామిడి ఫ్యాక్టరీ యాజమాన్యాలతో మాట్లాడుతూ రైతులకు గరిష్ఠంగా రూ.19 తక్కువ కాకుండా గిట్టుబాటు ధర కల్పించాలని ఆదేశించారు. అలాగే డిప్యూటీ సీఎం నారాయణస్వామి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి కలెక్టర్‌కు ఫోన్ చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రైతుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కొన్ని ఫ్యాక్టరీలు గిట్టుబాటు ధర కల్పించలేదని, ప్రభుత్వం రైతులపై ప్రత్యేక శ్రద్ధ వహించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు గుణశేఖర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహా కుంభాభిషేకం

కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెపల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీద్రౌపదీ ధర్మరాజుల వారి ఆలయంలో నేటి నుంచి మహా కుంభాభిషేకం పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ 29వ తేదీ సోమవారం గణపతి పూజ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించడం జరుగుతుందని, అలాగే మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ, హోమాలు, పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 31న బుధవారం ఉదయం 6 నుంచి 7.30 వరకు కుంభాభిషేకం, అర్చన, హారతులు చేపట్టడం జరుగుతుందని భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామికృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

గాలివాన బీభత్సం



దిగువపూనేపల్లె వద్ద చిత్తూరు-పెనుమూరు రహదారిలో విరిగి పడిన చెట్టు

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీనికితోడు విపరీతమైన ఈదురు గాలులు వీయడంతో వర్ష బీభత్సం సృష్టించింది. మామిడి చెట్లలో కాయలు నేలరాలడంతో రైతులకు నష్టం వాటిల్లింది. పలుచోట్ల చెట్లు కొమ్మలు విరిగి కిందపడ్డాయి. కలవకుంట పంచాయతీ పరిధిలోని దిగువపూనేపల్లె వద్ద చిత్తూరు–పెనుమూరు రహదారిలో చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

రుతుక్రమంపై అవగాహన ర్యాలీ





మాట్లాడుతున్న మెప్మా సిటీ మేనేజర్ సునీత, పుత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మెప్మా సిబ్బంది

నగరి: రుతుక్రమం సమయంలో మహిళలు తగిన జాగ్రత్తలు పాటించాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపగలరని మెప్మా సిటీ మేనేజర్ సునీత తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ రుతుస్రావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెప్మా ఆధ్వర్యంలో పరిశుభ్రత గురించి మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా, మెడికల్, సచివాలయం, ఏఎన్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: రుతుక్రమంలో తగిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ ఆశ తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మహిళలు రుతుక్రమ సమయంలో తలెత్తే సమస్యలను ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ అంశంపై వైద్యుల సూచనలు పాటిస్తూ మహిళలు చైతన్యవంతులు కావాలని సూచించారు. అనంతరం పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మేనేజర్ ప్రమీళ, సీఓలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రావణ్‌కుమార్, ఇన్‌కమ్ ట్యాక్స్ జస్టిస్ డి.రామలింగారెడ్డి, ఇండియన్ ఫారెస్ట్ డైరెక్టర్ జనరల్ ప్రకాష్ గోయల్, మాజీ మంత్రి శంకర్ నారాయణ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

రాయలసీమకు ప్రత్యేక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న కూరపాటి సురేష్

తిరుపతి కల్చరల్: అనాదిగా వెనుకబాటుకు గురైన రాయలసీమకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని, తాగు, సాగునీరు కేటాయించాలని ప్రత్యేక రాయలసీమ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కూరపాటి సురేష్ డిమాండ్ చేశారు. గాంధీ భవన్ ట్రస్ట్ ఆవరణలో ఆదివారం ప్రత్యేక రాయలసీమ సాధన సమితి ఆవిర్భావ దినోత్సవ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు మారినా రాయలసీమ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గతంలో సీమను చూపి కేంద్రం నుంచి నిధులు తెచ్చుకొని హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినట్టు విమర్శించారు. ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులు, రైతులు పట్టణాలకు వలస బాట పట్టి కూలీలుగా మారుతున్నారన్నారు. రాయలసీమలోని మేధావులు, విద్యార్థులు చైతన్యవంతులై సీమ కోసం గొంతెత్తాలని పిలుపునిచ్చారు. రాయలసీమలోని అన్ని వర్గాలను కలుపుకుని ఓ బలమైన ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక రాయలసీమ సాధన సమితి నేతలు నాగరాజురెడ్డి, అబ్దుల్ రఫీ, నరేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేపు గేట్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి భవానీనగర్ సర్కిల్‌లోని గేట్ డిగ్రీ కళాశాలలో మంగళవారం రిలయన్స్ జియో సంస్థలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు తెలిపారు. ఏదేని డిగ్రీ, బీటెక్ పూర్తి చేసి 35ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఈ సంస్థలో ఉద్యోగానికి ఎంపికైన వారు వర్క్ ఫ్రం హోమ్ ప్రాతిపదికన నెలకు రూ.19 వేల జీతంతో పనిచేయొచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 90000 72357, 90004 13453లో సంప్రదించాలని కోరారు.

సహకార బ్యాంకులపై ఆర్‌బీఐ వివక్ష

తిరుపతి కల్చరల్: సహకార బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ వివక్ష చూపుతోందని ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ జీవీ.సత్యనారాయణమూర్తి తెలిపారు. విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు తిరుపతి శాఖ సభ్యుల మహాసభ ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రుణాలకు సంబంధించి పరిమితులను నిర్ణయించుకునే అధికారం సహకార బ్యాంకులకు ఆర్‌బీఐ ఇవ్వడం లేదన్నారు. కొత్త శాఖల ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. అదేవిధంగా విద్యలో రాణిస్తున్న బ్యాంకు సభ్యుల పిల్లలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. 80 శాతం రుణాలను అల్పాదాయ వర్గాల ప్రజలకే ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ నారాయణస్వామి, జోనల్ మేనేజర్ వెంకటేష్, తిరుపతి బ్రాంచ్ మేనేజర్ మధు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం



అనాథలకు అన్నం పాకెట్లు అందజేస్తున్న విద్యార్థులు

తిరుపతి కల్చరల్: ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఆదివారం కపిలతీర్థం, అలిపిరి, రుయా తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఆకలితో అలమటించే అనాథులకు అన్నదానం చేశారు. విద్యార్థులు వంశీక్రిష్ణ, సాయి మాట్లాడుతూ స్వహస్త వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి తాము ప్రేరేపితమై స్నేహితులంతా కలిసి వారం రోజుల పాకెట్ మనీని ఉపయోగించి అనాథల ఆకలి తీర్చడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో మునుముందు కూడా సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. స్వహస్త సభ్యుడు సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో యువత పాల్గొనడం సంతోషకరమని, ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి వారంలో ఒక రోజు అన్నదానం చేయాలని కోరారు. విద్యార్థులు జయసూర్య, సోము శేఖర్‌రెడ్డి, రూపిక, కార్తీక్, స్వహస్త ఆర్గనైజేషన్ సభ్యులు పురుషోత్తం, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చెన్నైకి చెందిన శ్రీహర్ష నాట్య శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నాట్య గురువులు సౌందర్యవల్లి, గిరిధరణ, హర్షవర్ధిని పర్యవేక్షణలో సుమారు 58 మంది కళాకారులు సౌందరవల్లి, గిరిధరణ, దివ్య మునిరాజ్, సావిత్రి, అర్చన, అనజా, ప్రతిక్ష, వ్శ్వినాథ, కమల వెని, కీర్తన, దర్శిని, అభినయ సహన, రాహుల్, సవారిక నాట్యం చేశారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వలి సత్కరించి, జ్ఞాపకలు అందజేశారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన తెచ్చాం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి

- దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు
- సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇళ్ల వద్దే అందజేస్తున్న వలంటీర్లు
- వారి సేవలు ఎనలేనివి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డిప్యూటీ సీఎం, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): నిరంతరం అభివృద్ధిని ఆకాంక్షించే ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ సారథులుగా వలంటీర్లు సేవలు అందించడం అభినందనీయమని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నివర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి అందించే ఫలాలు నేరుగా లబ్ధిదారులకు చేరవేసేందుకు వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో గ్రామ సచివాలయ వ్యవస్థతో పాటు వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకు దక్కుతుందన్నారు. వలంటీర్లు నిరంతరం ప్రభుత్వానికి అనుగుణంగా వ్యవహరిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నారని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా వలంటీర్ల సహకారంతో ఇంటి వద్దనే పరిష్కరించుకుంటున్నారని అన్నారు. సామాజిక పింఛన్‌దారులకు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇళ్ల వద్దే పింఛను మొత్తాలను వలంటీర్లు అందిస్తున్నారని తెలిపారు. ప్రజలతో మమేకమై సేవలు అందిస్తున్న వలంటీర్లను మరింత ప్రోత్సహిస్తూ అవార్డులను ప్రకటించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చే వినతులపై అధికారులు సత్వరం స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఉన్న గ్రామాల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు వచ్చే వినతుల పట్ల అధికారులు వెంటనే స్పందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మండలంలో భూపంపిణీ చేపట్టాల్సి ఉందని ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం విశేష సేవలు అందిస్తున్న పలువురు వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులను ఆయన అందజేశారు. అనంతరం వారిని అభినందించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం..

రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వలంటీర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధికి పలు సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా, వలంటీర్లను ప్రోత్సహిస్తూ ఉత్తమ సేవలు అందించే వారికి అవార్డులను అందించడం హర్షదాయకమన్నారు. అనంతరం వారు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివయ్య, తహసీల్దారు విజయభాస్కర్, ట్రాన్స్‌కో ఏఈ నీరజ, వెలుగు ఏపీఎం హరికృష్ణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, సాతంబాకం ఎంపీటీసీ యశోదారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఏల్లుకూరిపల్లెలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

పంట సాగులో బిజీబిజీ



చదును చేస్తున్న రైతులు

పాలసముద్రం: మండల పరిధిలోని రైతన్నలు ఖరీఫ్ సాగుపై శని, ఆదివారంలో రెండోవిడతలు దుక్కులు చేసి వరి పంట వేస్తున్నారు. మండలంలో బోరు, బావుల కింద ఉన్న రైతులు ఈ నెలాఖరులో రైతు భరోసా నగదు పడుతుందన్న నమ్మకంతో సుమారు 950 హెక్టార్లలో వరిసాగు చేయనుండగా, మరికొంతమంది రైతులు 550 హెక్టార్లలో శ్రీవరి సాగు, డ్రమ్‌సీడర్ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నారు. వరి సాగు చేస్తున్న రైతన్నలు ఎక్కువగా రసాయన ఎరువులు, పురుగు మందులను వాడడం వల్ల భూములు మొద్దు బారిపోయి దిగుబడి తగ్గిపోతుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా లభించే ఆకులతో జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసుకుని పంటకు ఉపయోగిస్తే అధిక దిగుబడి పొందవచ్చన్నారు. అందువల్ల రైతులు చాలా వరకు వ్యవసాయాధికారి సూచనలు పాటిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



విజయపురం: భేటీ అయిన పూర్వ విద్యార్థులు

విజయపురం (నగరి): విజయపురం జెడ్పీ హైస్కూల్ (2002–2003)లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాడు వారికి పాఠాలు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అలాగే నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు చెప్పుకున్నారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు మొక్కలు నాటారు.

బస్సులో నిద్రించిన బాలిక

- తప్పిపోయిందంటూ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు
- అలిపిరి బస్టాండ్‌లో బాలికను గుర్తింపు
- తల్లిదండ్రులకు అప్పగించిన ఆర్టీసీ ఉద్యోగులు



పోలీసుల సంక్షంలో బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: బాలిక బస్సులో నిద్రించింది. తల్లిదండ్రులు బాలికను గుర్తించకుండా కిందకు దిగిపోయి తప్పిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలిపిరి ఆర్టీసీ బస్టాండ్‌లో బాలికను గుర్తించిన ఉద్యోగులు పోలీసుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. వెంకటగిరి మండలం చిన్నప్పరెడ్డిపల్లికి చెందిన మస్తాన్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులో తిరుపతి ఏడుకొండల బస్టాండ్‌కు చేరుకున్నారు. లగేజీని దించుకున్నారు. కుమార్తె హేమశ్రీ(11) బస్సులో నిద్రపోతున్నా గుర్తించకుండా వెళ్లిపోయారు. ఆ బస్సు మళ్లీ తిరుమలకు వెళ్లడానికి అలిపిరి బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడ ఒక టికెట్ తక్కువ రావడంతో సిబ్బంది బాలిక హేమశ్రీని గుర్తించారు. తండ్రి మస్తాన్ అని, వెంకటగిరి మండలం చిన్నప్పరెడ్డిపల్లి అని బాలిక తెలిపింది. కంట్రోలర్ వేలాయుధం బాలిక తండ్రి మస్తాన్‌కు కాల్ చేశారు. అప్పటికే మస్తాన్ తమ కుమార్తె కనిపించలేదని ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో ఆర్టీసీ ఉద్యోగుల నుంచి ఫోన్ కాల్ రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ఆర్టీసీ అధికారులు పోలీసుల సమక్షంలో బాలికను ఆమె తండ్రి మస్తాన్‌కు అప్పగించారు.